



# పరిష్కారం

**బా**ల్యదశలో కాల్లో గుచ్చుకున్న కొండ కలక వేయగా, జాంబవంతుడు ఓ మూలకు వొరిగి పోయాడు. కీచుకీచు మంటూ వానర సైనికులు కొందరు హనుమంతుడి చుట్టూ, మరికొందరు జాంబవంతుడి పక్కకూ చేరారు.

రెప్పవేయకుండా తోలుబొమ్మలాట చూస్తున్న తిమ్మయ్య, తలగుడ్డ ఓమారు సవరించుకుని. కుడికాలు చాచబోయి, "అబ్బా!" - అన్నాడు.

"యాభై ఏళ్లనాడు యిరిగిన యీతముల్లే నా మోకాల్లో యిప్పటికీ యింత నొప్పి పుట్టిస్తుంటె - అంత కొండ...."

తిమ్మయ్య మాట మధ్యలో ఆపి తన పక్కగా దూరంలో తల వంచుకుపోతున్న స్త్రీ వైపుకు చూశాడు.

"ఎవరు? కొండమ్మేనా?"

ఆ ప్రశ్న అతడి పెదాలని దాటగానే మోకాల్లోని యీతముల్లు గుండెల్లోకి పాకింది.

"బంగారక్కా! కేతిగాడు!"

ఆట చూస్తున్న జనంలో నుండి కొందరు కేక లేశారు. మరికొందరు చప్పట్లు చరిచారు.

తిమ్మయ్య చప్పున తన దృష్టిని ఆ స్త్రీ పోతున్నవైపు నుంచి ఆట జరిగే స్థలం వైపుకు తిప్పాడు. అతడి కళ్లు జాంబవంతుడి కోసం వెతికినై.

ఆ వృద్ధుడు మోకాలును చేత్తో పట్టుకుని తెరకు కిందగా తల వంచుకుని కూర్చున్నాడు. తిమ్మయ్య చేయి అప్రయత్నంగా అతడి మోకాలి మీదకి పోయింది. ఎన్ని తాటిబెల్లం కట్లకీ,

నాగుజెముడు పువ్వుల పట్లకీ బయటపడని, ఆ ముల్లు మోకాలిచిప్పలో మెదిలినట్టయింది.

"తలగుడ్డ తీసి పక్కన పెట్టి, బంగారక్క, కేతిగాడూ వచ్చారు చూడవయ్యా ముసలాయనా" - అంటూ పక్కన కూర్చున్న ఓ యువకుడు హెచ్చరించేసరికి, తిమ్మయ్య ఠక్కున తలెత్తి చూశాడు.

తెరకు ఓ పక్కగా నిశ్చలంగా వున్న హనుమంతుడి తలమీదగా జుట్టుపోలిగాడు వస్తున్నాడు - తల వంచుకుని విచారిస్తున్న జాంబవంతుడి నెత్తిన కాలు మోపి పావురంలాగా తెర మధ్యకు బంగారక్క ఓ గంతు వేసింది.

గిరజాల జుట్టు ముడిని ఓమారు సవరించుకుని తిమ్మయ్య ఓ నిట్టూర్పు విడిచాడు.

తను యువకుడుగా వుండగా, ముఖ్యంగా పెళ్ళికాకముందు, ప్రతి ఎండాకాలంలో తోలుబొమ్మ లాటల్ని చూసేందుకు తను ఎంతెంత దూరం నడిచిపోయేవాడు!

కారుచీకట్లో, పంటకాలవలనీ, గొబ్బిముళ్ళనీ, జనపమోడిల్నీ విరగదొక్కుకుంటూ - కేవలం యీ జుట్టుపోలిగాడూ, బంగారక్కల ప్రేమనీ, వాళ్ళ బూతుమాటల్నీ - మాట్టాడుకునేందుకూ, చీకటి పనులు చేసేందుకూ - వాళ్ళు పన్నుకునే వుపాయాల్నీ చూసి ఆనందించేందుకు - తను ఎన్ని కోసుల్ని, ఆమడల్ని నడచిపోయేవాడు! ఆ రోజుల్లో తనకు వృద్ధుడై, పర్వతం తేపతేపకీ మోకాల్లో కలక వేస్తుండగా, మాట్టాడడం తప్ప మరేపనీ చేయలేని జాంబవంతుడి మీద ఏ మాత్రం భక్తిగానీ - ఆఖరికి జాలిగానీ కలిగేది కాదు.

రామలక్ష్మణుల్ని మైరావణుడు కాళికాదేవికి బలి యివ్వబోతుంటే, జనంలో అనేకమంది ముసలివాళ్ళూ, ఆడవాళ్ళూ కంటతడిపెట్టి హోరున చీదేస్తుంటే, తను హఠాత్తుగా అంతమంది జనంలోంచిలేచి - "అక్కడ కదాపి - బంగారక్కనీ జుట్టుపోలిగాణ్నీ తెరమీదకి తీసుకురాండోయ్!" అని ఆటగాళ్ళని తను బిగ్గరగా కేక వేశాడు.

అప్పుడు ముసలాళ్ళూ, కొందరు ఆడవాళ్ళూ తనని ఎంతగా తిట్టారు!

కుర్రాళ్ళు తనని ఎంతగా మెచ్చుకున్నారు!

తిమ్మయ్య చెమ్మగిలిన కళ్ళతో ఓమారు జాంబవంతుడి వైపుచూసి -

"నా పాపానికి యిప్పుడు అనుభవిస్తూన్నా! రామలక్ష్మణులు అంత కష్టంలో వుండగా, బంగారక్కా పోలిగాళ్ళని తెరమీదకి తెమ్మన్న పాపాత్ముణ్ని! క్షమించు స్వామీ! క్షమించు!"

లోన పొంగి పొర్లబోతున్న దుఃఖాన్ని తలగుడ్డ చాటున అదిమిపట్టి, తిమ్మయ్య ఎడంచేత్తో చెంపలు కొట్టుకున్నాడు. వీధి బళ్లో - బాల్యంలో - కంఠస్థం చేసిన నృసింహ శతకంలోని... ఆ పద్యం అన్ని పాపాల్నీ హరించే... అది...అతడికి, సమయానికి గుర్తురాకుండా పోయింది. 'భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస– శ్రీ ధర్మపుర నివాస....' - అని ఆ ఆఖరు పాదాన్ని ఐదారుసార్లు పఠించి, తిమ్మయ్య పైపంచతో ఓమారు గట్టిగా కళ్ళు తుడుచుకున్నాడు.

'గారెలు వండేదా అల్లుడ? బూరెలు వండేదా? త్క్! త్క్!' అంటూ బంగారక్కా, మూల చేరి నిలబడ్డ హనుమంతుడి తలమీది నుంచి, మరో మూల మోకాళ్ళు పట్టుకుని వాలికూర్చున్న జాంబవంతుడి వీపు మీదికి తూనీగలాగా గెంతుతోంది.

తిమ్మయ్య తలమీద నిశ్శబ్దంగా పడుతూన్న మంచును ఓమారు గుడ్డతో తుడుచుకుని, "వందుతావే చెడుబాకిదానా! వందుతావ్! మొగుడి సంపాదనతో పరాయి ముండా కొడుకుల్కి ....హు!" – అంటూ పళ్ళుకొరికాడు.

"ఎందుకయ్యా ముసలాయనా పళ్ళు కొరుకుతావ్?" – పక్కన వున్న ఓ యువకుడు ప్రశ్నించాడు.

తిమ్మయ్య తల తిప్పకుండానే, "ఆ పాడుముండ చేసే పని.... హుఁ!" అన్నాడు.

"ముసలి మొగుడు మరేంచేస్తుంది?" – ఆ యువకుడు వెటకారంగా అన్నాడు.

తిమ్మయ్య మనోనేత్రం ముందు చప్పున ఏదో మెరిసినట్టయింది.

"అయితే... యిందా కెళ్లింది, కొండమ్మేనా?" – తనలో తను గొణుక్కుని వులికిపడి, ఆడవాళ్ళు కూర్చున్న వైపుకు చూశాడు.

ఆ మసక దీపాల కాంతిలో అతడి చత్వారపు కళ్లకి అందరు ఆడవాళ్లూ ఒకేరకంగా కనబడ్డారు. మరీ గడిచిన ఏడెనిమిది నెల్ల నుంచీ తన కళ్లకి ఆడవాళ్లంతా ఒకే మోస్తరుగానూ, మగాళ్లంతా ఒకే మాదిరిగానూ కనబడుతున్నారు. ఏదో గొంతును బట్టి యిది కొండమ్మనీ, ఆ మాట్టాడేది ఆదెమ్మత్తనీ, యీ పలకిరించేది పుల్లమ్మ పిన్ననీ తెలుసుకోగలుగుతున్నాడు. అయితే తెరమీద వున్న ఆ జాంబవంతుడూ, బంగారక్కా – అంతా – అంత బాగా కనదుతున్నారేం? తనకు దగ్గిర దృష్టిపోయి, దూరదృష్టి ఏర్పడుతోంది గామాలు!

"ఏం ముసలాయనా నువ్వు కుర్రోడుగా వున్నప్పుడు అలా పోలిగాడిలా ఏమైనా చేసేవాడివా?"

తెరమీద జరిగే ప్రేమకోలాహలానికి పరవశుడైపోయి నవ్వుతూన్న ఓ యువకుడు, తిమ్మయ్య భుజం పట్టుకుని లాగి అడిగాడు.

తిమ్మయ్య ఆ ప్రశ్నకి ఏమీ జవాబు చెప్పలేకపోయాడు. హఠాత్తుగా కళ్లు జిగేలు మన్నై – గుండెలు బెణికి నట్టయినయ్ – మోకాలు కలక వేసింది.

కేతిగాడు రావడం చూడగానే పోలిగాడు ఏమీ ఎరగనట్టు కాస్త ముందుకు వచ్చి– "మామా! నీ కోసమే చూస్తున్నా!" అన్నాడు. బంగారక్క చీపురు తీసుకుని వూడుస్తోంది.

అవును! అచ్చుగా కొండి కూడా యింతే! తను గుమ్మంలో కనబడగానే చీపురుతో ఏదో వూడుస్తున్నట్టు నాటకం ఆడుతుంది. ఆ దొంగ నాగడు, 'మామా! యిందాకట నుంచీ నీ కోసం చూస్తున్నా' అంటాడు. అంతా దొంగలు! చెడుబాయికీ ముండలు!

తిమ్మయ్య కాండ్రించి వుమ్మేసి, ఆలోచనలో పడ్డాడు. నాగయ్యతో కొండాం కూడా – యిట్టాగే బంగారక్కలాగా నాటకం ఆడుతుండి వుంటుంది. అందుకే తన కన్న ముందు లేచిపోయింది.

"ఇక రాను మామా! రాను!" – బంగారక్క మొగుడు తన్నే తన్నులకు దాని ప్రియుడు హడిలిపోయి లబోదిబో అంటున్నాడు.

తిమ్మయ్య ముసలి కళ్ళు మెరిసినై. మీసాల చాటున ఓ చిరునవ్వు కదిలింది. కళ్లు పెద్దవి చేసి, వూపిరి బిగపట్టి తెరవంక రెప్ప వేయకుండా ఓ రెండు మూడు క్షణాల కాలం చూసి – "అంత

బలంగల మొగున్ని వదిలి. ఆ కుర్రవెధవ కోసం పాలుమాలిందేం? తనూ తొందరగా యింటికెళ్ళి నాగయ్యని యీ విధంగానే –"

కదుల్లాడిన వుత్సాహంతోపాటు, కాలుని కదిలించబోయాడు. మోకాల్లో యీతముల్లు కలుక్కు మంది. గుండెలు గతుక్కుమన్నై. నిస్పృహగా తెరవంక చూశాడు తిమ్మయ్య.

"ఏమోయ్ – హనుమా! యీ కార్యం నువ్వు నెరవేర్చాలిసిందే! నాలో జవసత్వాలు నశించినై" – జాంబవంతుడు రెండు చేతుల్తో మోకాలిని పట్టుకుని, మూల నుంచి లేచి ముందుకు వచ్చాడు.

"అయితే, నేనే సముద్రాన్ని లంఘిస్తాను తాతా!" – అంటూ హనుమంతుడు తోక ఆడించాడు.

ఆ మాటలు విన్న తరవాత, తిమ్మయ్యకు యిక ఆట చూడాలనే కోర్కె పోయింది. ఆపైన యిక ఏమేం జరుగుతుందో, ఎవరేం చేస్తారో అతడికి తెలుసు. అతడి ఆలోచన సొంత విషయం మీదికి పోయింది. తనకూ జాంబవంతుడి లాగానే వృద్ధాప్యం వచ్చిందో కొండరాయి గనక గుచ్చుకున్న చోటు నుంచి అటూయిటూ కదలడు. కాని యీతముల్లు అట్లా కాదే! అది కండరాల వెంట ఎంత దూరమైనా పాకుతుంది. కండలో దిగడం వల్ల అలా జరగలేదని, వైద్యుడు వరహాచారి చెప్పాడు.

పైపంచ తలమీద కప్పుకుని, దూరంగా చీకట్లోకి చూస్తూ తిమ్మయ్య గొణిగాడు.

'ఊహు! నాకు ఆ అదృష్టం లేదు. జాంబవంతుడు చేసిన పుణ్యంలో నేను ఎన్నో వంతు చేశాను నాకు అలాంటి అదృష్టం కలగడానికి... అయినా అంత హనుమంతుడు అవసరం లేదు... ఓ చిన్న... యిక్కడా మైరావణుడి మీద యుద్ధం చేయాల్సింది లేదు... ఆ నాగిగాణ్ని నలగకొట్టేవాడు...'

తిమ్మయ్య బరువెక్కిన హృదయంతో లేచి నుంచుని, పైపంచ ఓ మారు గట్టిగా దులిపి, తలకు చుట్టాడు. అతడి మస్తిష్కంలో పరస్పర విరుద్ధమైన అనేక భావాలూ, ఆలోచనలూ సంఘర్షించ సాగినై. ఏదో సత్యాన్ని – తన హృదయారాటాన్నీ, బాధనీ తొలగించే చిట్కానీ, క్రియనీ, తను కొద్దిలో అందుకోలేకపోయినట్టు మధన పడ్డాడు.

బంగారక్క భర్తచేత, దాని ప్రియుడు తన్నులు తింటూన్నప్పుడు తనకేదో పెద్ద ఆలోచనే కలిగింది. కాని అంతలోనే మరిచిపోవడం జరిగింది. అదేమైవుంటుంది?

జనంలో నుంచి నడుస్తూ, తిమ్మయ్య అదేదో కనుక్కునేందుకు తన బుర్రలో అన్ని మూలల్నీ వెతికాడు. కాని అదేదో తెలిసినట్టుగానే తెలుస్తూ, పట్టుకు మాత్రం అందకుండా తప్పించు కుంటోంది.

రోడ్డు మలుపు తిరిగి, ఎదురుగా తన యిల్లు కనబడగానే అతడు ఠక్కున ఆగిపోయాడు. కొండమ్మ యీసరికి, ఆ నాగయ్యతో బంగారక్క లాగానే అలాంటి బూతు మాటల్తో, పాడుపని చేస్తూంటుంది. అచ్చగా దాని చాటు మొగుడు అన్నట్టుగానే తనను చూసి, ఆ నాగిగాడు, 'యిందాకటి నుంచీ నీ కోసం చూస్తున్నాను' అంటాడు కాని... బంగారక్క మొగుడు కేతిగాడు చేసినట్టు తనూ, ఆ దొంగవెధవని పట్టుకుని నాలుగు తన్నగలడా?

రోడ్డుకు మధ్యగా నిలబడి, రెప్పవాల్చకుండా తన యింటివేపుకు ఓ మారుచూసి, తిమ్మయ్య

గి(రున వెనక్కి తిరిగాడు.

'యీ ముసలితనంలో, నాకు యీ రెండో పెళ్ళి ఎందుకని, ఎంతగానో ఏడ్చాను. అయినా నా మాట విన్నదెవరు? ముసలితనంలో, యింత కాచిపోసేందుకూ, కాలికీ చేతికీ అడ్డం వచ్చేం దుకూ, అంటూ, యీ కొండిని కట్టారు. అది ఏదో యింత కాచి పోసి అంతటితో వూరుకోదాయె... ఏంచేసేది? వాణ్ని... ఆ నాగిగాన్ని తన్నేందుకూడా నాలో బలం లేదు.....'

తిమ్మయ్య యీ ఆలోచనల్తో మధన పడుతూ, తిరిగి తోలుబొమ్మలాట దగ్గిరకు వచ్చాడు. యీసారి కూర్చోకుండా దూరంగా నిలబడ్డాడు. అతడు నుంచున్న చోటుకు కొంచెం దూరంలో, ఏదో సంభాషణ తగ్గుస్థాయిలో కొద్దికాలం పాటు సాగి హఠాత్తుగా తీవ్ర దశకు చేరింది.

"అవునోయ్! పెళ్ళానికి కావలసింది వట్టి శరీర బలమే కాదు నువ్వనుకునేట్టు. అదే స్త్రీ కోరే దైతే – పలుగుల్ని జడగా అల్లుతూ కాటారాళ్ళని కాళ్ళకు కట్టుకుని పరుగెత్తే కామయ్య పెళ్ళాం, ఆ బక్క దానయ్యతో ఎందుకు లేచిపోతుంది? మీసం మీద నిమ్మకాయల్ని నిలిపే మాణిక్యయ్య భార్య సంగతి మనకందరికీ తెలిసిందేగదా!"

"ఉష్! మెల్లిగా – వీపులు మన సొంతం!"

తరవాత వాళ్ల సంభాషణ – ఉష్ యిష్ల్లోకి దిగింది.

ఒక్క అక్షరం పొల్లుపోకుండా అంతవరకూ. ఆ సంభాషణ విన్న తిమ్మయ్యలో ఏదో పరమ సత్యం పరవళ్లు తొక్కినట్టయింది.

"అదే.... యిదే.... అరగంట కిందట నాకు తగిలిన ఆలోచన! హుం!" – అతడు గట్టిగా దగ్గి, ఓమారు తెరవంక చూసి, చకచక ఆ సంభాషిస్తున్న వాళ్ల దగ్గిర కెళ్ళి ఠక్కున చతికిలపడి కూర్చు న్నాడు.

తిమ్మయ్య దగ్గిరకు వచ్చి కూర్చోగానే వాళ్లు సంభాషణ ఆపేశారు.

అతడు చుట్టూ ఓమారు భయంగా, అనుమానంగా చూసి, ఆ యిద్దరిలో కొంచెం అందుబాటులో వున్న యువకుడి ముఖంలో ముఖంపెట్టి మెల్లిగా అడిగాడు.

"మొగుడు ఎంత బలం గలవాడైనా,.... ధైర్యం గలవాడైనా... ఆ బుద్ధున్న ఆడది... ఆ పని... చేస్తూనే వుంటదంటావా?"

ఆ యువకుడు ఓ నిండు నిమిష కాలం. తిమ్మయ్యని బాగా పరికించి చూసి – "అవును తాతా! అది అలాగే జరుగుతూంటుంది. గడ్డపలుగుల్ని, గోగుపుల్లల్లాగా విరిచేంత బలం వున్న ప్రతివాడి పెళ్ళాం అతణ్నుంచి సుఖపడుతుందనలేం. ఎదుర్రొమ్ము మీద ఓ ఐదంగుళాల కండ పెరిగున్నా, అతడికి భార్య భారంగానే కనబడొచ్చు – ఆమె అసంతృప్తితో బాధపడుతూండొచ్చు"

తిమ్మయ్య ఓ క్షణం ఆగి, పెదాల్ని బాగా బిగించి, మెడను బాగా ముందుకుచాచి, ఒక్కో అక్ష రాన్ని వత్తి వత్తి అడిగాడు.

"అయితే ఆ కిటుకు?"

ఆ యువకుడు పెద్దగా నవ్వి, "పెద్ద కిటుకే తాతా! బలం అనేక రకాలు. కృష్ణుడి కంటే

భీముడు బలంగలవాడే – కాని ఆ రోజుల్లో వెంటబడేందుకు అవకాశం వున్న అడవాళ్లంతా ఎవరివెంట బడ్డారు?" అన్నాడు.

"కృష్ణపరమాత్మ!" – అప్రయత్నంగా తిమ్మయ్య అనేశాడు.

"అంతే తాతా! అంతే! బలం అనేక రకాలు. ఒకందుకు వుపయోగించింది, మరొకందుకు వుపయోగించదు"

తిమ్మయ్య హృదయం తేలికయింది. పరిష్కారం కాదని వొదిలేసిన సమస్య పరిష్కరింపబడ్డట్టూ, మానదనుకున్న గాయం ఓ చిట్కాతో యిట్టే మాయమైనట్టూ, అతడికి తోచింది.

తలగుడ్డ తీసి వల్లెవాటుగా వేసుకుంటూ. గట్టిగా కాండ్రించి ఓమారు దూరంగా వూసి, చిరు నవ్వుతో అన్నాడు.

"అబ్బాయ్! నువ్వు యిప్పుడు చెప్పింది – యిందాకనే నేను కొంత గ్రహించాను. నేను వట్టి మూర్ఖుణ్ణని అనుకోకు. పెద్దబాలశిక్షా, బాలరామాయణం, నృసింహ శతకం....యింకా...యింకా చాలా చదివాను. బంగారక్క అంత బలం, హుషారూ వున్న మొగుడు కేతిగాడు వుండగా, ఆ కుర్రకుంకగాడితో ఆ పాడుపని చేసేటప్పుడే అనుకున్నాను... అక్కడ ఏదో కిటుకు వుందని. నువ్వన్నట్టు బలం అనేక రకాలు. అంత బలం వున్న భీముడికి దొరికింది ఎవతె? హిడింబేగదా!... కాని కృష్ణుడు...."

తిమ్మయ్య ధోరణి ఠక్కున ఆగిపోయింది.

తెరమీద పెద్ద కోలహలం జరుగుతోంది.

రామలక్ష్మణుల్ని కాళికాదేవికి బలిచ్చేందుకు మైరావణుడు తయారౌతున్నాడు.

తిమ్మయ్య తీవ్రంగా తల పంకించి, బిళ్లం గోడులా ఎగిరి నిలబడి, ఆ యువకుడి భుజాన్ని గట్టిగా పట్టుకుని వూపి, "పలుగుల్ని చీపురుపుల్లలాగా వంచే కామయ్య పెళ్ళాం లేచిపోయింది! ముడికి వచ్చేంత మీసం వున్న మాణిక్యయ్య భార్య సంగతి నీకు తెలుసు! అంత హుషారూ, చలాకీ వున్న కేతిగాడి చాటున బంగారక్క ఏం చేస్తుంటుందో చిన్నప్పటి నుంచీ చూస్తూనే వున్నాను మరి..." అన్నాడు.

తిమ్మయ్య తన పెదాల్ని ఆ యువకుడి చెవులను తాకేంత దగ్గిరగా పెట్టి, పెద్దగా దిశలు మార్మోగేట్టుగా అన్నాడు.

"అంతంత వాళ్ళ పెళ్ళాలు అలా చేస్తుంటే – అరవై ఏళ్ళ వయసులో... రెండో పెళ్ళి చేసుకున్న నేను.... నా భార్య కొండాం... కొండమ్మ... ఆ పని చేస్తూన్నదని ఎందుకు బాధ పడాలి?"

మేఘాలు అడ్డంలేని మెరుపులాగా, ఏ లక్ష్యం లేకుండా శూన్యంలోకి దూసుకు పోతూండే బాణంలాగా, తిమ్మయ్య అంతమంది జనం మధ్యకి పరిగెత్తి తెర వైపుకు తీవ్రంగా చూస్తూ "అక్కడ కదాపి – బంగారక్కనీ, కేతిగాణ్నీ తెరమీదకి తీసుకురాండోయ్!" అని గర్జించాడు.

❋

*(అభిసారిక మాసపత్రిక : జూలై, 1950)*